# తిమోతికి
# వ్రాసిన రెండవ పత్రిక

1 క్రీస్తు యేసులో ఉన్న జీవాన్ని గురించిన వాగ్దానాన్ని
అనుసరించి దేవుని చిత్తప్రకారం క్రీస్తు యేసు అపొస్తలుడైన
పౌలు,
2 నా ప్రియ కుమారుడైన తిమోతికి వ్రాయునది:
మన తండ్రియైన దేవుని నుండి, మన ప్రభువైన క్రీస్తు యేసు నుండి నీకు కృపా కనికరం సమాధానాలు కలుగును గాక.

## కృతజ్ఞతలు చెల్లించుట

3 నా పితరులు సేవించినట్లే, స్వచ్ఛమైన మనస్సాక్షితో నేను
సేవిస్తున్న దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ, రాత్రింబవళ్ళు మానక నిన్ను
నా ప్రార్థనలలో జ్ఞాపకం చేసుకుంటున్నాను.
4 నీ కన్నీరు జ్ఞాపకం చేసుకుని, నేను ఆనందంతో నింపబడేలా
నిన్ను చూడాలని ఎంతగానో ఆశపడుతున్నాను.
5 నీలో ఉన్న యథార్థమైన విశ్వాసాన్ని నేను జ్ఞాపకం చేసుకున్నాను,
అది మొదట నీ అమ్మమ్మ లోయిలోను తర్వాత నీ తల్లియైన యునీకేలో ఉండింది. ఆ విశ్వాసమే ఇప్పుడు నీలో కూడా ఉందని నేను నమ్ముతున్నాను.

## పౌలుకు సువార్తకు నమ్మకంగా ఉండమని విజ్ఞప్తి

6 ఈ కారణంగానే, నేను నీపై చేతులు ఉంచడం వలన నీవు
పొందిన దేవుని కృపా వరాన్ని మరింత రగిలించి వృద్ధి చేయమని నీకు
జ్ఞాపకం చేస్తున్నాను.
7 దేవుడు మనకు పిరికితనాన్ని కలిగించే ఆత్మను ఇవ్వలేదు కాని
శక్తి, ప్రేమ, ఇంద్రియ నిగ్రహం గల ఆత్మను అనుగ్రహించారు.

8 కాబట్టి నీవు మన ప్రభువు కోసం సాక్ష్యమివ్వడానికి గాని
ఆయన కోసం బందీనై ఉన్న నా గురించి కాని సిగ్గుపడకు. దానికి
బదులు దేవుని శక్తినిబట్టి సువార్త కోసం నాతో పాటు కలిసి శ్రమలను
అనుభవించడానికి సిద్ధపడు.
9 దేవుడు మనల్ని రక్షించి, పరిశుద్ధ జీవితాన్ని జీవించడానికి
పిలిచిన పిలుపు, మనం చేసిన మంచి పనులను బట్టి కాదు గాని,
ఆయన ప్రణాళిక కృపను బట్టియే. ఆ కృప సృష్టి ఆరంభానికి ముందే
క్రీస్తు యేసు మూలంగా మనకు ఇవ్వబడింది,
10 అయితే మరణాన్ని నాశనం చేసి, జీవాన్ని, నిత్యత్వాన్ని సువార్త
ద్వారా వెలుగులోనికి తీసుకువచ్చిన మన రక్షకుడైన క్రీస్తు యేసు
ప్రత్యక్షత వలన అది నేడు మనకు వెల్లడి చేయబడింది.
11 ఈ సువార్తను ప్రకటించడానికి, బోధించడానికి అపొస్తలునిగా
నేను నియమించబడ్డాను.
12 ఈ సువార్త వల్లనే, నేను ఈ విధంగా కష్టాలను
అనుభవిస్తున్నాను, అయినా దానిని గురించి సిగ్గుపడను, ఎందుకంటే
నేను నమ్మినవాని గురించి నాకు తెలుసు; నాకు అప్పగించిన
దానిని చివరి రోజు వరకు ఆయన కాపాడగలడని నేను దృఢంగా
నమ్ముతున్నాను.
13 క్రీస్తు యేసులో ప్రేమ, విశ్వాసం కలిగి, నీవు నా నుండి విన్న
మంచిబోధను ఆదర్శంగా పాటించు.
14 నీకు అప్పగించబడిన ఈ మంచి విషయాలను మనలో
నివసిస్తున్న పరిశుద్ధాత్మ సహాయంతో కాపాడు.

## నమ్మకత్వం అపనమ్మకత్వం

15 ఆసియా ప్రాంతంలోని విశ్వాసులందరు నన్ను విడిచి
వెళ్లిపోయారని నీకు తెలుసు, వారిలో ఫుగెల్లు, హెర్మొగెనే అనేవారు
కూడా ఉన్నారు.

16 ప్రభువు కోసం నాకు పడ్డ సంకెళ్ళను గురించి సిగ్గుపడకుండా,
అనేకసార్లు నన్ను ఆదరించిన ఒనేసిఫోరు ఇంటివారిపై ప్రభువు
కనికరం చూపించును గాక.
17 అతడు రోమాకు వచ్చినప్పుడు నేను కనబడే వరకు నా కోసం
వెదికాడు.
18 అతడు ఎఫెసులో నాకు ఎన్ని విధాలుగా సహాయపడ్డాడో నీకు
చాలా బాగా తెలుసు. ప్రభువు దినమందు దేవుని దృష్టిలో అతడు
కనికరం పొందునట్లు ప్రభువు అతనికి అనుగ్రహించును గాక!

# 2

## యేసు క్రీస్తు యొక్క నమ్మకమైన సైనికుడు

1 నా కుమారుడా, క్రీస్తు యేసులోని కృప చేత బలపడుతూ ఉండు.
2 అనేకమంది సాక్షుల సమక్షంలో నేను నీకు నేర్పిన సంగతులను
ఇతరులకు బోధించగల నమ్మకమైన వారికి అప్పగించు.
3 యేసు క్రీస్తు కోసం ఒక మంచి సైనికుని వలె నాతో పాటు కష్టాలను
భరించు.
4 యుద్ధానికి వెళ్లే ఏ సైనికుడైన తన సాధారణ జీవన వ్యాపార
విషయాల్లో ఇరుక్కుపోడు కాని, తనపై అధికారిని సంతోషపరచడానికి
ప్రయత్నిస్తాడు.
5 అదే విధంగా ఒక క్రీడాకారుడు క్రీడానియమాల ప్రకారం పందెంలో
పాల్గొంటేనే తప్ప విజయ కిరీటాన్ని పొందుకోలేడు.
6 అలాగే పంటలోని భాగం మొదటిగా పొందాల్సింది కష్టపడి పని
చేసే రైతే.
7 నేను చెప్పిన విషయాల గురించి ఆలోచించు, మన ప్రభువు నీకు
అన్ని విషయాలను తెలుసుకోగల పరిజ్ఞానాన్ని దయచేస్తారు.
8 మహారాజైన దావీదు సంతానంగా పుట్టిన యేసు క్రీస్తు మృతులలో
నుండి సజీవంగా లేచారని గుర్తుంచుకో. ఇదే నేను ప్రకటించిన
సువార్త.

9 దీనిని బట్టే నేను నేరస్థునిలా బంధించబడ్డాను. కాని దేవుని
వాక్యం బంధించబడలేదు.
10 కాబట్టి, దేవునిచే ఎన్నుకోబడినవారు కూడా నిత్యమహిమతో
యేసు క్రీస్తులో ఉన్న రక్షణను పొందాలని నేను ఈ శ్రమలన్నింటిని
సహిస్తున్నాను.
11 ఈ మాట నమ్మదగింది:

మనం ఆయనతో పాటు చనిపోతే,
ఆయనతో పాటు మనం కూడా జీవిస్తాము;
12 మనం భరిస్తే,
ఆయనతో పాటు మనం కూడా ఏలుతాము.
మనం ఆయనను తిరస్కరిస్తే,
ఆయన కూడా మనల్ని తిరస్కరిస్తారు;
13 మనం నమ్మకంగా లేకపోయినా,
ఆయన నమ్మకంగానే ఉంటారు,
ఎందుకంటే ఆయన తనను తాను తిరస్కరించుకోలేరు.

## అబద్ధ బోధకులు

14 దేవుని ప్రజలకు ఈ విషయాలను జ్ఞాపకం చేస్తూ ఉండు.
వినేవారిని నాశనం చేయడమే తప్ప ఏ విలువ లేని మాటల గురించి
వాదించవద్దని దేవుని ఎదుట వారిని హెచ్చరించు.
15 ఆమోదించబడినవానిగా, సిగ్గుపడనక్కరలేని పనివానిగా,
సత్య వాక్యాన్ని సరిగా బోధించేవానిగా నిన్ను నీవు దేవునికి
నిరూపించుకోవడానికి ప్రయాసపడు.
16 దుష్టమైన కబుర్లకు దూరంగా ఉండు, ఎందుకంటే వాటిలో
మునిగిపోయేవారు మరింత భక్తిహీనంగా మారతారు.
17 వారి బోధలు కుళ్ళింపచేసే వ్యాధిలాంటివి. అలాంటివారిలో
హుమెనేయు, ఫిలేతు అనేవారు ఉన్నారు.
18 వారు సత్యానికి దూరమయ్యారు. పునరుత్థానం ముందే
జరిగిపోయిందని చెప్తూ, కొందరి విశ్వాసాన్ని చెడగొడుతున్నారు.

19 అయితే దేవుని యొక్క పునాది స్థిరంగా నిలిచి ఉండి, దానిపై
ఈ విధంగా ముద్ర వేయబడి ఉంది: "తన వారు ఎవరో ప్రభువుకు
తెలుసు, ప్రభువు నామాన్ని ఒప్పుకునే ప్రతివారు దుష్టత్వం నుండి
తొలగిపోవాలి."
20 ఒక పెద్ద ఇంట్లో బంగారు, వెండి పాత్రలే కాకుండా కర్రవి మట్టివి
కూడా ఉంటాయి; వాటిలో కొన్ని ప్రత్యేకమైన వాటికి ఉపయోగపడితే,
మరికొన్ని సాధారణమైన పనులకు వాడబడతాయి.
21 అదే విధంగా, తమను తాము శుద్ధి చేసుకునేవారు ప్రత్యేకమైన
పాత్రలుగా పరిశుద్ధపరచబడి, యజమానికి ఉపయోగకరంగా ఉండి,
మంచి పని కోసం సిద్ధపరచబడిన పాత్రలుగా వాడబడతారు.
22 యవ్వనకాల ఆశల నుండి పారిపో, కపటం లేని హృదయంతో
ప్రభువును వేడుకొనువారితో పాటు నీతి, విశ్వాసం, ప్రేమ, శాంతిని
అనుసరించు.
23 మూర్ఖపు అవివేకమైన వాదనలను విసర్జించు, ఎందుకంటే అవి
గొడవలను పుట్టిస్తాయని నీకు తెలుసు.
24 ప్రభువు సేవకుడు కొట్లాడేవానిగా ఉండకుండా అందరితో
దయగలవానిగా ఉండాలి, బోధించగల సామర్థ్యం కలిగి ఉండాలి,
కోపిష్ఠిగా ఉండకూడదు.
25 దేవుడిచ్చిన తరుణంలో మారుమనస్సును పొంది సత్యాన్ని
గ్రహిస్తారనే ఆశ కలిగి, తనను ఎదిరించేవారిని దీనత్వంతో సరిదిద్దాలి.
26 అప్పుడు వారు తమ తప్పును తెలుసుకుని, తన ఇష్టాన్ని
చేయడానికి వారిని చెరలోనికి తీసుకెళ్లిన సాతాను ఉచ్చులో నుండి
తప్పించుకోగలరు.

# 3

1 అంత్యదినాలలో భయంకరమైన కాలాలు వస్తాయని నీవు
తెలుసుకో.
2 ఎందుకంటే, ప్రజలు స్వార్థపరులుగా, ధనాన్ని ప్రేమించేవారిగా,
గొప్పలు చెప్పుకునేవారిగా, అహంకారులుగా, దూషించేవారిగా,

తల్లిదండ్రులకు అవిధేయులుగా, కృతజ్ఞతలేనివారిగా, అపవిత్రులుగా,
3 ప్రేమలేనివారిగా, క్షమించలేనివారిగా, అపనిందలు వేసేవారిగా, స్వీయ నియంత్రణ లేనివారిగా, క్రూరులుగా, మంచితనాన్ని ప్రేమించలేనివారిగా,
4 ద్రోహులుగా, మొండివారిగా, అహంకారులుగా, దేవునికి బదులు సుఖానుభవాన్ని ప్రేమించేవారిగా,
5 దైవభక్తి కలిగి ఉన్నా దాని శక్తిని నమ్మనివారిగా ఉంటారు. అలాంటి వారికి దూరంగా ఉండు.
6 అలాంటివారు, పాపంతో నిండిన అన్ని రకాల దురాశలకు బానిసలైన మోసపూరిత స్త్రీల ఇళ్ళలో చొరబడి వారిని లోబరుచుకుంటారు.
7 ఈ స్త్రీలు ఎప్పుడు నేర్చుకుంటూనే ఉంటారు కాని సత్యాన్ని ఎన్నడు గ్రహించలేరు.
8 యన్నే, యంబ్రే అనేవారు మోషేను ఎదిరించినట్లే ఈ బోధకులు కూడా సత్యాన్ని ఎదిరిస్తున్నారు. వారికున్న దుష్టహృదయాన్ని బట్టి విశ్వాస విషయంలో తృణీకరించబడ్డారు.
9 అయినా వారు ముందుకు సాగలేరు ఎందుకంటే, ఆ ఇద్దరికి జరిగినట్లే, వీరి మూర్ఖత్వం అందరికి స్పష్టమవుతుంది.

## తిమోతికి చివరి హెచ్చరికలు

10 అయితే, నా బోధల గురించి, నా జీవిత విధానం, నా ఉద్దేశాలు, విశ్వాసం, ఓర్పు, ప్రేమ, దీర్ఘశాంతం,
11 హింసలు, శ్రమలు అంటే, అంతియొకయలో, ఈకొనియలో, లుస్త్ర ప్రాంతాల్లో నాకు కలిగిన హింసను నేను ఎలా సహించానో అన్ని నీకు తెలుసు. అయితే ప్రభువు వాటన్నిటి నుండి నన్ను తప్పించారు.
12 నిజానికి, క్రీస్తు యేసులో భక్తిగల జీవితాన్ని జీవించాలనుకొనే వారందరు హింసకు గురి అవుతారు.

13 అయితే దుష్టులు, వంచకులు ఇతరులను మోసం చేస్తూ తామే
మోసపోతూ మరింతగా చెడిపోతారు.
14 కాని నీవైతే, నీవు నేర్చుకున్న వాటిని, నీవు నమ్మి విశ్వసించిన
వాటిలో స్థిరంగా కొనసాగు ఎందుకంటే, నీవు ఎవరినుండి వాటిని
నేర్చుకున్నావో నీకు తెలుసు.
15 క్రీస్తు యేసులో విశ్వాసం ద్వారా కలుగు రక్షణ గురించిన జ్ఞానాన్ని
నీకు కలుగజేయడానికి శక్తిగల పరిశుద్ధ లేఖనాలు బాల్యం నుండే నీకు
తెలుసు.
16 ప్రతి లేఖనం దేవుని ప్రేరణ చేతనే కలిగింది, అది
బోధించడానికి, గద్దించడానికి, సరిదిద్దడానికి, నీతిలో నడిపించడానికి
ఉపయోగపడుతుంది.
17 ఈ లేఖనాలను బట్టి, దేవుని సేవకుడు ప్రతి సత్కార్యం
చేయడానికి పూర్తిగా సిద్ధపడి ఉండాలి.

# 4

1 నేను దేవుని ఎదుట, తాను వచ్చినప్పుడు తన రాజ్యంలో
సజీవులకు మృతులకు తీర్పు తీర్చబోయే యేసు క్రీస్తు ఎదుట నీకు ఈ
బాధ్యతను ఇస్తున్నాను:
2 ఆతురత కలిగి అనుకూల సమయంలోను అనుకూలంగా లేని
సమయంలోను సిద్ధంగా ఉండాలి; ఎంతో సహనంతో, సరియైన
సూచనలతో ప్రజలను సరిదిద్దుతూ, గద్దిస్తూ, ప్రోత్సహిస్తూ వాక్యాన్ని
ప్రకటించు.
3 ఎందుకంటే, ప్రజలు మంచిబోధను అంగీకరించని ఒక సమయం
వస్తుంది. అప్పుడు వారు తమ సొంత ఆశలకు అనుగుణంగా తమ
దురద చెవులు వినడానికి ఇష్టపడే వాటినే బోధించే అనేకమంది
బోధకులను తమ చుట్టూ చేర్చుకుంటారు.
4 వారు సత్యం నుండి తొలగిపోయి కట్టుకథలు వినడానికి తమ
చెవులను అప్పగిస్తారు.
5 కాని నీవైతే అన్ని పరిస్థితుల్లో నిబ్బరం కలిగి కష్టాలను సహిస్తూ
సువార్తికుని పని చేస్తూ, నీ పరిచర్య పనులను పూర్తిగా నెరవేర్చు.

6 ఇప్పటికే నేను దేవుని ఎదుట పానార్పణగా పోయబడుతున్నాను.
నేను వెళ్లవలసిన సమయం దగ్గరలోనే ఉంది.
7 నేను మంచి పోరాటం పోరాడాను, నా పరుగు పందాన్ని
ముగించాను, నా విశ్వాసాన్ని కాపాడుకున్నాను.
8 కాబట్టి నీతిమంతుడు న్యాయాధిపతియైన ప్రభువు ఆ రోజున
నాకు బహుమతిగా ఇవ్వబోయే నీతి కిరీటం నా కోసం దాచబడి ఉంది.
ఈ బహుమానం నాకు మాత్రమే కాదు ఆయన ప్రత్యక్షత కోసం ప్రేమతో
ఎదురు చూస్తున్న వారందరికి అనుగ్రహిస్తారు.

### తిమోతికి వ్యక్తిగత మాటలు

9 త్వరగా నా దగ్గరకు రావడానికి ప్రయత్నించు.
10 దేమా ఈ లోకాన్ని ప్రేమించి, నన్ను వదిలి థెస్సలొనీక వెళ్లాడు.
క్రేస్కే గలతీయకు, తీతు దల్మతీయకు వెళ్లారు.
11 లూకా మాత్రమే నాతో ఉన్నాడు. నా పరిచర్యలో మార్కు నాకు
సహాయంగా ఉంటాడు, కాబట్టి అతన్ని నీతో పాటు తీసుకురా.
12 నేను తుకికును ఎఫెసు పట్టణానికి పంపించాను.
13 నీవు వచ్చేటప్పుడు నేను త్రోయలో కర్పు దగ్గర ఉంచిన నా
అంగీని, నా పుస్తకాలను మరి ముఖ్యంగా చర్మపు ప్రతులను వెంట
తీసుకురా.
14 కంసాలి పని చేసే అలెగ్జాండరు నాకు ఎంతో హాని చేశాడు.
అతడు చేసిన పనులకు ప్రభువు వానికి తగిన ప్రతిఫలమిస్తారు.
15 అతడు మన బోధను ఎంతగానో వ్యతిరేకించాడు కాబట్టి నీవు
కూడా అతని విషయంలో జాగ్రత్తగా ఉండు.
16 నేను మొదటిసారి న్యాయసభలో నాపై వేయబడిన
ఆరోపణలకు జవాబు ఇస్తున్నప్పుడు ఎవరూ నా పక్షాన నిలబడలేదు,
అందరు నన్ను వదిలి వెళ్లిపోయారు. అది వారికి వ్యతిరేకంగా
ఉండకూడదు
17 కాని నా ప్రభువు నాకు తోడుగా నిలిచి నన్ను బలపరిచారు
ఎందుకంటే, నా ద్వారా సువార్త పూర్తిగా ప్రకటించబడి

యూదేతరులంతా దానిని వినడానికి దేవుడు నన్ను సింహం నోటి
నుండి విడిపించారు.
18 నాకు కలిగే ప్రతి కీడు నుండి ప్రభువు నన్ను కాపాడి తన పరలోక
రాజ్యంలోనికి క్షేమంగా చేర్చుకుంటారు. ఆయనకే మహిమ నిరంతరం
కలుగును గాక ఆమేన్.

## తుది పలుకులు

19 అకుల ప్రిస్కిల్లకు, ఒనేసిఫోరు ఇంటి వారందరికి నా వందనాలు.

20 ఎరస్తు కొరింథులోనే ఉండిపోయాడు, త్రోఫిముకు అనారోగ్యంగా
ఉన్నందుకు నేను అతన్ని మిలేతులో వదిలి వచ్చాను.
21 శీతాకాలం రాకముందే నీవు ఇక్కడకు రావడానికి ప్రయత్నించు.

యుబూలు నీకు వందనాలు తెలియజేయమన్నాడు, అలాగే పూదే,
లీను, క్లౌదియ, ఇక్కడి విశ్వాసులైన సహోదరి సహోదరులందరు తమ
వందనాలు నీకు తెలియజేస్తున్నారు.

22 ప్రభువు నీ ఆత్మతో ఉండును గాక. దేవుని కృప నీకు తోడై
ఉండును గాక ఆమేన్.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.
You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.
Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025
aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6